# గమ్యం

రోడ్డు వంకలన్నింటినీ చక్రాలు తీర్చిదిద్దుతుండగా బస్ రొద చేసుకుంటూ ముందుకు పోతోంది. లోపల ప్రయాణీకులంతా నిద్రలో ఊగిపోతున్నారు. తెల్లవారు ఝామునే రైలుదిగి మొదటి బస్సు పట్టుకుని తన మామగారి ఇల్లు చేరడానికి తొందర పడుతున్నాడు, రామ్మూర్తి. యువకుడు. సన్నగా, పొడుగ్గా, నల్లగా ఉంటాడు. ఇంజనీరింగ్ ప్రథమ కక్ష్యలో పాసైనాడు. తను ఇంకా హాస్టల్ లో ఉండగానే తన ప్రొఫెసర్లు చెప్పేశారు అతని పరీక్ష ఫలితం "యు హేవ్ ఎబ్రైట్ ఫ్యూచర్, మై బాయ్ విష్ యు ఆల్ ది బెస్ట్" ప్రిన్సిపాల్‌గారి ఆశీర్వచనం.

"డోన్ట్ గెట్ అప్‌సెట్ ఇఫ్ యూ హేవ్ టు వెయిట్ ఫర్ ఎ జాబ్." తన పరిశోధనా వ్యాసాన్ని పర్యవేక్షించిన ప్రొఫెసర్ చేసిన హెచ్చరిక ఇంకా చెవుల్లో గింగురుమంటోంది. నిరుద్యోగ సమస్య కాగితాల మీద, గోడల మీద చూస్తున్న తనకు నిజంగా భయం వేసింది. తనూ చేరవలసిందేనా ఈ నిరుద్యోగుల క్యూల్లో? ఎలా అయినా ఉద్యోగం సంపాదించాలి. ఎలాగైనా ... ఆలోచిస్తూ పక్కన నిద్దర పోతున్న ప్రయాణీకుల వైపు అసూయగా చూస్తూ సిగరెట్లు తగ లేస్తున్నాడు.

తను చాలా సేపు ఎదురు చూసిన బస్ వచ్చింది. బెడ్డింగ్, ట్రంక్ పెట్టె టాపు మీద వేసి ఎటాచ్ కేస్ చేతితో పట్టుకుని మెల్లగా బస్ లోకి నడిచాడు. ఆడవాళ్ల సీట్లు దాటుకుంటూ ముందు కెళుతూ ఉండగా ఓ అందమైన అమ్మాయి కనిపించింది. పరాకుగా చూసాడేమో సీత లాగే ఉంది. ఆఁ ... అరె ... సీతా? ఆముక్కా ఆకళ్లా! తన వేపే చూస్తోంది ... ఆఁ ... అయినా ఇక్కడెందుకుంటుంది? సిల్లీ! ఏమిటా ఆలోచనలు!

బస్సులో! ...

"కాస్త తోవ ఇస్తారా, మాష్టారూ?"

వెనక నుండి ఒకాయన పిలుపు. రివరీ లోంచి బయటపడ్డాడు రామ్మూర్తి. మర్యాదగా కళ్లు దించుకుని ముందుకు నడిచాడు. సీటులో కూర్చుని మీదకు చూశాడు. పైన రాక్ లేదు. ఒళ్లోనే పెట్టుకుని కూర్చున్నాడు ఎటాచ్ కేస్‌ని, చంటి పిల్లాణ్ణి కూచో పెట్టుకున్నట్టు.

*　　*　　*　　*　　*

"ఒరేయ్! సూరిగా!"

"చిత్తం, బాబూ!" పరిగెత్తు కొచ్చాడు పాలేరు.

"తూర్పు పొలంలో ఆకులు మాడిపోతున్నాయి-చూసుకోరటరా? నీరు పెట్టండని చెప్పానా, ఏం చేస్తున్నావురా, వెధవా, ఆకులు చస్తుంటే. సరియైన సమయంలో సరియైన పని చెయ్యకపోతే గింజలెలా వస్తాయ్?" కసురు కున్నాడు సూర్యారావు.

"నీరు చాల్లేదు, బాబయ్యా...మీకు తెలియందేముంది? దక్షిణ వేపు పొలానికి నీరు కడుతున్నాము. పగలంతా తోడేసరికి నీరు ఖాళీ అయిపోయె. మూడు రోజులైంది, బాబూ, బొత్తిగా అడుగు తగిలే స్తోంది నుయ్యి." సూర్యారావుకి బాధ అనిపించింది. ఈ నుయ్యి కూడ ఎండిపోతే మరి మడి సంగతి? వెంటనే ఆలోచన వచ్చింది. ఓ గొట్టపు బావి తవ్విస్తే? అల్లుడు రామ్మూర్తి ఎలాగూ వస్తున్నాడుగా? మేనల్లుడితో సంప్రదించి వెంటనే ఓ నిర్ణయం తీసుకోవాలి.

"సరే, సూరిగా! ఉన్నంత మటుకు ఆపొలానికి ఆపి, తూర్పు వాడికి నీరు పెట్టండి." భుజం మీద కండువా సరిచేసుకొని బయలుదేరాడు ఇంటి వైపు.

*　　*　　*　　*　　*

డ్రైవరుకు సైగ చేసి మెల్లగా పోతున్నాడు పాసెంజరు. బాక్ సీట్లో కూర్చుని ముందుకు వంగి రెండు పక్కల చూస్తున్నాడు మస

లాయన. దూరాన ఏదో బోర్డు, పక్కగా ఓ బాట కనబడుతున్నాయి డ్రైవరు భుజం తట్టి ఆగమని సైగ చేశాడు.

“గంగిగోవుపాలెం, సార్!” వినమ్రతగా సమాధానం చెప్పాడు టాక్సీ డ్రైవర్. చేత్తో హాండ్ బాగ్ పట్టుకొని పాసెంజర్ దిగిపోయాక మరి కొంత ముందుకు వెళ్లి బ్యాక్ చేసుకొచ్చాడు డ్రైవర్.

రోడ్డు మీద దుమ్ము రేగింది.

రియర్‌వ్యూ మిర్రర్ లోంచి తన పాసెంజర్‌నే చూస్తున్నాడు డ్రైవర్. కొంచెం ఆశ్చర్యాన్ని కలిగించే మనిషి. బట్టలు మాసి ఉన్నాయి. కాని, ముఖంలో ఏదో హుందా. రాత్రి బెజవాడలో ఎక్కాడు.

“దూరంగా పోవాలి. వస్తావా?” అని మాత్రం అడిగాడు.

కారు వెళ్లిన వైపే చూస్తూ రోడ్డు పక్క సిమెంటు దిమ్మ మీద కూర్చున్నాడు ముసలాయన. పక్కనే బాగ్ ఉంది.

ఊరులోకి తోవ కనబడుతూంది. కాని, ఏం చెయ్యాలా అని ఆలోచిస్తున్నాడు. నిద్రమైకం వదిలింది. ఎన్నాళ్లకు మళ్లీ మంచి నిద్ర పట్టింది! హుఁ... నిట్టూర్చాడు. ఎండ బాగా మొహం మీద కొస్తోంది. నెమ్మదిగా ఓ పెద్ద చింత చెట్టు కిందికి చేరాడు.

* * * * *

ఠంచనుగా తొమ్మిదిన్నరకు ఆగింది గంగిగోవుపాలెం కంకర రోడు వద్ద రాజమండ్రి బస్. రామ్మూర్తి దిగి టాప్ మీద ట్రంకూ, హోల్డాలూ దింపుకున్నాడు. దుమ్ము రేపుకుంటూ బస్ అదృశ్యమైపోయింది. రామ్మూర్తికి సామాను పట్టుకోవడానికి మనిషి కోసం వెతికే అలవాటు లేదు. ఎటాచ్ కేస్‌ను హోల్డాల్‌లో సర్ది, భుజం మీద హోల్డాల్, ఒక చేతితో ట్రంకూ పట్టుకొని అమెరికన్ పీస్ కోర్ వర్కర్‌లా కంకర రోడ్డున నడుస్తుండగా, దూరాన చింత చెట్టు కింద నున్న ముసలాయన్ని చూశాడు. ఆయన ముఖంలో వర్చస్సు చాలా ఆకర్షణీయంగా ఉంది. కష్టం, సుఖం తెలిసిన వాడిలా ఉన్నాడు. లగేజీ మోస్తున్న యువకుడి

వైపు చూస్తున్నాడు ముసలాయన. ముసలాయనను చూడగానే ఎందుకో యోగి వేమన గుర్తుకొచ్చాడు రామ్మూర్తికి. కొన్ని క్షణాల వరకూ అలా ఒకర్నొకరు చూస్తూ ఉండి పోయారు వాళ్లిద్దరూ.

రామ్మూర్తికి క్యూరియాసిటీ ఆగలేదు.

"కొత్తవారిలా ఉన్నారు. ఏ ఊరు వెళ్లాలి, తాతగారూ?" అడిగాడు.

"తాతగారు" అన్నమాట ఎడారిలో పడని వర్షపు బిందువులా స్ఫురించింది ముసలాయనకు.

బోర్డు వైపు వేలు చూపించాడు.

"ఎవరింటికి?"

"నేను ... కొత్త." చిన్న నవ్వు నవ్వాడు.

ఏదో అడగబోయి ఊరుకున్నాడు రామ్మూర్తి. తనకు అనవసరమైన విషయాల గురించి క్యూరియాసిటీలో ప్రశ్నలు వేయడం సభ్యతకు విరుద్ధం.

"మా మామగారి ఇల్లు ఈ ఊళ్లోనే. మీకు అభ్యంతరం లేకపోతే మా యింటికి రండి." ఆహ్వానించాడు.

రామ్మూర్తి ముందూ, వెనక ముసలాయనా నడుస్తూ ఊరు చేరుకున్నారు. ముసలాయన్ను వీధి సావిట్లో కూర్చోమని, "సీతా" అనుకుంటూ ఇంట్లోకి నడిచాడు.

"రా, నాయనా, చదువు సాంతం పూర్తయిందా?" అత్తగారి కుశల ప్రశ్నలు.

"ఊఁ" అన్నాడు రామ్మూర్తి బరువుగా.

"అమ్మాయ్, సీతా, బావొచ్చాడు." పెరట్లోకి కేకేసింది ఇల్లాలు.

"ఏమోయ్, అల్లుడూ" అంటూ సూర్యారావు లోపలకి వచ్చాడు. సావిట్లో పెద్ద మనిషికి నమస్కరించిన తరువాత స్నానాలు, భోజనాలూ అయ్యాయి. సాయంత్రం వాహ్యాళికి బయలుదేరారు. మామ, అల్లుడూ, ముసలాయనా.

ముసలాయన మౌనంగా ఉన్నాడు. సూర్యారావు ఊళ్లోని విషయాలూ, తన పొలం సంగతులు చెబుతున్నాడు అల్లుడికి. చుట్టూ పొలాలన్నీ చాలా భాగం ఎండిపోయాయి. రెండేళ్లుగా వర్షాలు లేవు. బొత్తిగా వర్షాధారపు భూములు. కనీసం విత్తనాలు కూడా అవడం లేదు. ఊళ్లో దారిద్ర్యం, ఆకలి ముసురుకుని ఉన్నాయి. కాస్త పచ్చగా ఉన్నది సూర్యారావే!

పల్లె ప్రజల్లో ఉత్సాహం లేదు. ఎవరి మొహంలో చూసినా ఏదో దైన్యం, కాటకపు లక్షణాలు. ఊరు బొత్తిగా డెజర్టెడ్ విలేజిలా ఉంది. ముసలాయన చుట్టూ చూస్తూ కాస్త వెనకగా నడుస్తున్నాడు.

"దండాలయ్యా!" ఎవరో ఒకతను సూర్యారావుకి నమస్కరించాడు.

"ఏం, బాబూ, ఎప్పుడొచ్చారు?" అంటూ రామ్మూర్తిని పలకరించాడు. ఊరికి కొత్త మనిషి వస్తే జనం పోగయ్యేవారు. కరణం గారింటికి చుట్టా లొచ్చారని. చుట్టూ చేరి ప్రశ్నలు వేసేవారు. ఇప్పుడు అలాంటి ఉత్సాహం ఏమీ ప్రదర్శించడం లేదు కనబడ్డ వాళ్లెవరూ

"ముసలయ్యకు బాగో లేదయ్యా, ఓమారు వస్తారా?" దీనంగా అడిగాడు సూర్యారావుని.

"ఆ, ముసలయ్యకా ... ఈ మధ్య కనబడ్డం కూడా లేదు. ఏమిటి సుస్తీ?"

"మూడు నెలలైంది, బాబూ! జ్వరం విపరీతమైన దగ్గు. పట్నం పోయి వైద్యం చేయించుకోడానికి. కాసులుండాలిగా? పిల్లలూ పట్న

వాసం పోయారు. భార్య గుటుక్కుమంది. మీరు పడుతున్న కష్టాలు ఆ భగవంతుడే తీర్చాలి'' అంటూ వాపోయాడు.

"పద, నారాయుడూ, ఇప్పుడే వెళదాం'' అంటూ నారాయుడు వెనకే నడిచారు ముగ్గురూ.

ముసలాయన వింతగా చూస్తున్నాడు. ఆయన్ను ఎవరూ పలకరించలేదు. ఆయన్ను ప్రశ్న వేసి విసిగిస్తారేమో ననుకున్నాడు. ఎవరూ ఏమీ అడక్కపోవడంతో అతనికి ఎంతో ఊరట నిచ్చింది.

ముసలయ్య నుక్కి మంచం మీద ఉన్నాడు, గడియో, క్షణమో అన్నట్టు.

"కరణంగారు వచ్చారు, ముసలయ్యా!''

"ఆఁ వచ్చారా, బాబూ! మీదయ! నాకు భూమి మీద నూకలు నిండాయి.''

"అదేమిటి, ముసలయ్యా, అలా అంటావు? పట్నం పంపి వైద్యుణ్ణి తెప్పిస్తా. బాగై పోతావులే.''

"ఎంత మాట బాబూ! నాకు ఆ మాట మాత్రం అనే వారేరీ? కాని, ఇంక నాకు వైద్య మెందుకు, బాబయ్యా.. నా సంగతి ఇంతే... బాబూ, ఒక్క మాట. ఊళ్లో నీళ్లులేక పోయె ... వర్షాలు లేవాయె. పెద్దింటి బాబులు. ఊరుకి సాయం చెయ్యాల. ఓ చెరువు తవ్వించండి మీ పెద్దలకు పుణ్యం. ఆ రెండు గింజలూ పండక పోతే మాలాంటి వాళ్లం ఎలా బతకాలి?'' మెల్లగా బతిమాలు కున్నాడు.

ముసలయ్య వైపే చూస్తున్నాడు ముసలాయన.

"పాపం, ఒంటరి వాడు'' అంటూ కరణం సానుభూతి చూపాడు.

"ముసలయ్యా, నేనింటికెళ్లి బత్తెం పంపుతాను. కాస్త గంజికాచి పొయ్యమను ఈ నారాయడికి. డాక్టరికి కబురు చేస్తా'' అంటూ బయటకు నడిచారు మామా, అల్లుడూ.

ముసలాయన మాత్రం అలాగే నిలబడిపోయాడు. అతని మొహం ఎర్రగా జేవురించింది. కళ్ల వెంబడి నీళ్లొచ్చేటట్టున్నాయి.

రామ్మూర్తి లోపలికెళ్లాడు మళ్లీ. ముసలాయన ఏదో నిశ్చయించుకున్న వాడిలా బయటకి వచ్చాడు.

"ఇఫ్ యూ డోన్ట్ మైండ్" అని ఠక్కున ఆగిపోయాడు.

రామ్మూర్తి ఆగిపోయాడు. సూర్యారావు వెనక్కి వచ్చాడు.

"మీరేమీ అనుకోకపోతే నేనిక్కడే ఉండిపోతాను".

ముసలాయన ఇంగ్లీషులో అన్నాడు.

రామ్మూర్తికి ఏమనాలో తోచలేదు.

ముసలాయన మళ్లీ గుడిసెలోకి వెళ్లాడు.

ఇంటికెళ్లాక సీత అడిగింది తన మనసులో మెదులుతున్న ప్రశ్న : "ఆ ముసలాయన ఎవరు, బావా?."

"అదే అంతు పట్టడం లేదు. సీతా, ఎవరో పెద్ద మనిషిలా ఉన్నాడు. మొహంలో చాలా సంస్కారం కనబడుతోంది. ఎక్కడి నుంచో పారిపోయి వస్తున్నట్టున్నాడు ..." ఏదో జ్ఞాపకం వచ్చినట్టుంది కాని, మళ్లీ ఏదో సందేహం. మాటాడక ఊరుకున్నాడు.

ఆ సాయంకాలం సీతా, రామ్మూర్తి షికారు కెళ్లారు. పొలాల లోంచి నడుస్తున్నారు. వాళ్లు తూర్పు పొలంలో గట్లు వెంబడి నడుస్తుండగా సీత సూర్యారావు చెప్పిన గొట్టపు బావి విషయం ప్రస్తావించింది.

"సీతా, ఇదేమిటి. ఈ గొయ్యేమిటి?"

"మన గ్రామానికి కరంటు వస్తోంది."

"ఫైన్. అయితే గొట్టపు బావి మాత్రమే కాకుండా ఒక పంప్ సెట్ కూడా అమర్చుకోవచ్చు. ఓ ఫైవ్ హెచ్ పంప్ సెట్ సుమారు ఇరవై ఎకరాల సాగుకి సరిపోతుంది" పొలంలోకి దిగాడు రామ్మూర్తి.

కొత్తగా తవ్వబడిన మన్ను ఆగోతి అడుగుది ఎండిపోయి ఉంది. గుప్పెడు మన్ను చేతి రుమాలులో కట్టాడు.

"ఇదిగో సీతా, రేపే దీన్ని మా లాబ్ కి పంపి ఎనలైజ్ చేయిస్తాను, ఓ వారంలో మనకు తెలుస్తుంది - నీరు ఎన్ని అడుగుల కింద పడేదీ ... ఇదిగో, ఇక్కడ వస్తుంది పంప్ హౌస్. ఇక్కడ రావచ్చు అసలు ట్యూబ్ వెల్. కాలువలు ఇలా వస్తాయి. సంవత్సరానికి సుమారు మూడు పంటలు పండించవచ్చు. ట్యూబ్ వెల్ సింక్ చేయడానికి, పంప్ సెట్ కి, షెడ్ కి అంతా - కలిపి ఆరువేలు అవుతుంది. దేవుడు మేలు చేస్తే ఇదంతా నాకంపెనీ పేరుతోనే జరుగుతుంది. నేను రేపే పట్నం పోయి బ్యాంకు ఏజంట్లను కలసి పాతిక వేలు ఋణ సహాయం చేయమని అడుగుతాను. నాకు ఉద్యోగం చెయ్యాలని లేదు."

రామ్మూర్తి ఏదో ఉద్రేకంతో చకచకా మాట్లాడేస్తున్నాడు. అలా చూస్తూ ఉండి పోయింది సీత.

మరుసటి రోజు ఉదయం ఎరకు ముసలాయన జ్ఞాపకం రాలేదు - రామ్మూర్తికి. వెంటనే ముసలయ్య గుడిసెకి వెళ్లాడు.

"నమస్కారం" అంటూ లోపలకి వెళ్లి ముసలాయనను పలకరించాడు. ముసలాయనలో మార్పు వచ్చింది. చేతిలో సిరింజ్. ముసలయ్యకు అప్పుడే ఏదో ఇంజక్షన్ ఇచ్చినట్లున్నాడు. కట్ బనియన్ వేసుకున్నాడు. ఓ మూల చాప మీద మూడు సీసాలున్నాయి.

"ష్!" అన్నాడు, గుడిసె ద్వారం వైపు చూపిస్తూ ముసలాయన. "పల్లె ప్రజలు సెల్ఫ్ లెస్ పీపుల్ ... నారాయుడు ఈజ్ ఎ గుడ్ మాన్."

రామ్మూర్తి కేం బోధపడ లేదు.

"యంగ్ మాన్! నన్నీ ఊరు తెచ్చినందుకు చాలా కృతజ్ఞుణ్ణి." ముసలాయన గడగడా ఇంగ్లీషు మాట్లాడేస్తున్నాడు. ముఖంలో ఏదో ఉద్రేకం ఉత్సాహం ఉన్నాయి. "ఈ ముసలయ్య, నారాయుడు, నువ్వు,

మీరంతా నాజీవితానికి ఓగమ్యాన్ని చూపారు. మనిషి చనిపోయే ముందు చెయ్యవలసింది చాలా ఉంది. వైరాగ్యం చనిపోయే ముందు రావలసింది. శరీరంలో శక్తి ఉండగా ప్రతి మనిషి శాయశక్తులా పని చెయ్యవల్సిందే. వైరాగ్యం పాపం. ముసలయ్య చూడు చనిపోతాననే అనుకున్నాడు. కాని, అతని మనసులో చూశావా ఎల్లాంటి కోరిక, తపన ఉన్నాయో–చెరువు తవ్వించమన్నాడు. పూర్ ఫెలో ... తెలివి తక్కువ వాడు. వర్షాలే లేకపోతే చెరువులవల్ల ప్రయోజనం ఏముంది?

విత్ లక్ ముసలయ్య కోలుకుంటాడు. ఊళ్లో కావలసినన్ని గొట్టపు బావులు వస్తాయి."

రామ్మూర్తికి ఆశ్చర్యం కాదు, కళ్ల వెంట నీళ్లు వచ్చేస్తున్నాయి. "థ్యాంక్యూ, డాక్టర్, థాంక్యూ" బయటకు నడిచాడు.

ఒక్క ఉదుటన ఇల్లుచేరి, "సీతా,సీతా" అని బిగ్గరగా పిలిచాను. "ఏమయిందండీ?" సీత గదిలోకి వచ్చింది హడావిడిగా.

"ఆపేపరేదీ? అదే, నిన్న నేను తీసుకొచ్చింది?"

వెదికి పట్టుకొచ్చింది సీత.

గబగబా వెదికాడు. "ఇదిగో చూడు సీతా! మనింటికి వచ్చిన ముసలాయన ఎవరో కాదు.." మైసూర్ డేట్ లైన్‌లో ఉన్న వార్త చదివాడు గట్టిగా.

"ఇక్కడ ప్రఖ్యాత వైద్యులు డాక్టర్ హెగ్డే నాలుగు రోజులై కనబడడం లేదు. వయస్సు 64. భార్య కొద్ది రోజుల క్రితమే చనిపోయింది. చాల కాలం అస్వస్థతతో బాధపడుతున్న భార్యకు డాక్టర్ హెగ్డే స్వయంగా పరిచర్యలు చేసేవారు. పిల్లలు లేరు. వీరి జన్మస్థలం మదనపల్లి. పుట్టుకతో తెలుగువారు. వైద్యుడుగా తన వృత్తి ధర్మాన్ని అతిచాకచక్యంతో నిర్వహించేవారు, పోలీసులు ఆచూకీ తియ్యడానికి ప్రయత్నిస్తున్నారు. ఆత్మహత్యేమోనని కొంత మంది.."

"చాలు ఊరుకోండి!" సీత విసుక్కుంది. "పోలీసులు ఎప్పుడూ కీడే ఎంచుతారు."

ఆంధ్రప్రభ సచిత్రవార పత్రిక – 13–11–74

(దీపావళి ప్రత్యేక సంచికలో ప్రచురితమైనది)